Www.telanganasahithi.com

RNI:TELTEL/2015/64477

# తెలంగాణ సాహితి

TELANGANA SAHITHI TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

PUBLISHED FROME : MAHABUBNAGAR

సంపుటి : 09 | సంచిక : 271 | శనివారం 27 - 07 - 2024 | ఎడిటర్ :ఎం.మనోహర్ గౌడ్ | పేజీలు: 04 | వెల : 02/-

published Frome : Hyderabadh, vijayavada, karimnagar, chitur, khammam, warangal, nalgonda, rajamandri, visakapatnam, mahabub nagar, prakasham

విలేకరులు కావలెను

తెలంగాణ సాహితి

తెలుగుదినపత్రిక

Contact : 8247569876



# రాష్ట్ర అప్పులపై సీఎం అబద్ధాలు

- తప్పుడు ప్రచారాలతో తప్పుదోవ పట్టించే ప్రయత్నం
- 52 రోజులుగా దాడులు, అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం
- లెక్కలు చూపాల్సి వస్తుందనే బడ్జెట్ పెట్టడం లేదు
- శ్వేత పత్రాలతో మభ్య పెట్టే యత్నం
- మీడియా సమావేశంలో మాజీ సిఎం జగన్



అమరావతి,జూలై26(ఆర్ఎన్ఎ): రాష్ట్ర అప్పులపై సీఎం చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ ఆరోపించారు. శుక్రవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం తిరోమనంలో వెళ్తోందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 52 రోజుల్లో రాష్ట్రంలో అక్రమాలు, ఆకృత్యాలు పెరిగిపోయాయని ఆరోపణలు గుప్పించారు. ప్రశ్నించే వాళ్లను అణచివేస్తున్నారు. వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విధ్వంస పాలన సాగుతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. బడ్జెట్ కూడా పెట్టలేని స్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉంది. పూర్తి స్థాయి బడ్జెట్ పెడితే బాబు హామీలకు లెక్కలు చూపాల్సి వస్తుంది. అందుకే బడ్జెట్ ప్రవేశపెట్టడానికి వెనకడుగేస్తున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. బాబు పాలనలోనే రాష్ట్రం ఆర్థికంగా దిగజారిందని జగన్ అన్నారు. మిగతాది 2 లో...

# నిరాశ కలిగించిన కాంగ్రెస్ బడ్జెట్

## దశదిశ లేదన్న మాజీమంత్రి వేముల



నిజామాబాద్,జూలై26(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ పసలేనిదిగా ఉందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రభుత్వ మొదటి బడ్జెట్ దశ దిశ లేకుండా ఉందని, ఇది తిరోగమన దిశలో నడిపే బడ్జెట్ అని అభివర్ణించారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చేసిన ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా విమర్శించడం సరికాదన్నారు. పదేళ్లలో అన్నిరంగాలను అభివృద్ది చేసిన గనత కెసిఆర్‌దని అన్నారు. ఏడాదిలో 2 లక్షలు ఉద్యోగాల ప్రస్తావనే లేదని, ఆరుగ్యారంటీలను పూర్తిగా మరిచిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని నిందించారని, భట్టి 57 వేల కోట్లు అప్పు తెస్తామన్నారని.. చెప్పారు. మహాలక్ష్మి పథకంపై బడ్జెట్ మహా నిరాశ కలిగించిందని, కోటి మంది మహిళలు నెలకు రూ. 2500 కోసం ఎదురుచూస్తున్నారని, ఎనిమిది నెలల్లో మహిళలకు రూ.20వేల కోట్లు ప్రభుత్వం బకాయి పడ్డదని చెప్పారు. ఆసరా పింఛను రూ. 4 వేలు ఇస్తామని బాండు పేపర్ మీద రాశారని, మరి ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. విద్యార్థులకు 5 లక్షల విద్యా భరోసా కార్డు, స్కూటీలు ఇస్తామన్నారని వాటి ప్రస్తావన ఏదని నిలదీశారు. కొత్త రేషన్ కార్డులు, రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ప్రస్తావన కూడా లేదని మండిపడ్డారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పి మొండిచేయి చూపారని, చేనేత కార్మికులకు గుండు సున్నా చూపారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకపోతే రుణమాఫీ పేరిట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతున్నదని వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. తక్కువ మందికి రుణమాఫీ చేసినందుకు సంబురాలు చేసుకోవాలా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూరినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి మిగతాది 2 లో...

# తగ్గుతున్న బంగారం ధరలు

## బడ్జెట్ తరవాత ఐదువేల వరకు తగ్గింపు

## కొనుగోళ్లు పెరిగాయంటున్న వ్యాపారులు



న్యూఢిల్లీ,జూలై26(ఆర్ఎన్ఎ): దేశీయంగా బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పట్టడంతో కొనుగోళ్లు కూడా పెరుగుతున్నాయి. కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు తర్వాత ఆభరణాల కొనుగోలుకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. దీపావళి, దంతేరస్ వంటి పండగలు, వివాహాది శుభకార్యాలు ముందుండడంతో ఆభరణాల కొనుగోలుకు డిమాండ్ పెరిగినట్లు

# తెలంగాణ యువతకు అండగా ప్రభుత్వం

- ప్రభుత్వ ఖాళీల భర్తీకి తోణ చర్యలు
- ఫైర్‌మెన్ పాసింగ్ ఔట్ పరేడ్‌లో సిఎం రేవంత్

మిగతాది 2 లో...




హైదరాబాద్,జూలై26(ఆర్ఎన్ఎ): ఏ ఆకాంక్షతో యువత తెలంగాణ పోరాటంలో పాల్గొన్నారో.. ఆ ఆకాంక్షను గత ప్రభుత్వం నెరవేర్చలేదని సిఎం రేవంత్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేశామన్నారు. తెలంగాణ విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖలో భర్తీ అయిన 483 మంది ఫైర్‌మెన్ అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. తెలంగాణ విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వీరంతా నాలుగు నెలలుగా తీసుకుంటున్న శిక్షణ పూర్తయింది. ఈ క్రమంలోనే అభ్యర్థుల పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..ఫైర్ మెన్ శిక్షణ పూర్తి చేసుకున్న యువకులకు శుభాకాంక్షలు తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న మిమ్మల్ని చూసి మీ

# సైనికుల త్యాగాలను దేశం మరవదు

- ఉగ్రవాదులను సమూలంగా పెకిలిస్తాం
- కార్గిల్ అమరులకు ప్రధాని మోడీ నివాళి
- పాక్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు
- షింకున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు శ్రీకారం



లద్దాఖ్,జూలై26(ఆర్ఎన్ఎ): దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన సైనికుల త్యాగాలకు యావత్ భారతావని ఎప్పటికీ రుణపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కార్గిల్ 25వ విజయ దివస్ ను పురస్కరించుకుని శుక్రవారం ఆయన లద్దాఖ్ వెళ్లారు. ద్రాస్‌లోని యుద్ధ స్మారకాన్ని సందర్శించి అమర జవాన్లకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పాకిస్థాన్‌పై విరుచుకు మిగతాది 2 లో...

# స్థానిక ఎన్నికల కసరత్తులో సిఎం రేవంత్


- త్వరగా పూర్తి చేసేలా కార్యాచరణకు సిద్దం
- స్థానిక ఎన్నికలపై అధికారులతో సమీక్ష
- త్వరలోనే వివరాలు వెల్లడించనున్న ప్రభుత్వం



హైదరాబాద్,జూలై26(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. పార్లమెంట్ ఎన్నికలు ముగియడం, బడ్జెట్ సమావేశాలు కూడా ముగింపునకు రానుండడంతో ఒకటి రెండు నెలల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. దీనికితోడు వాతావరణం కూడా ఇప్పుడు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంది.

# నీతి ఆయోగ్ సమావేశ బహిష్కరణ

- ఆనాడు కెసిఆర్ బహిష్కరిస్తే విమర్శలు
- కాంగ్రెస్ పార్టీది ద్వంద్వ వైఖరన్న కెటిఆర్



హైదరాబాద్,జూలై26(ఆర్ఎన్ఎ): నీతి అయోగ్ సమావేశ బహిష్కరణపై కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ప్రధాని మోదీతో సమావేశాన్ని నాడు కేసీఆర్ బాయ్‌కాట్ చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టిందని, ఇరువురు కుమ్మక్కయ్యారని ఆరోపించిందని చెప్పారు. మరి ఇప్పుడు నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాని రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించడంపై కాంగ్రెస్ ఏం చెబుతుందని ప్రశ్నించారు. ప్రధాని మోదీని చోటే భాయ్ ఎందుకు కలవానుకోవడం లేదు?, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఎందుకు మాట్లాడాలని ఎందుకు అనుకోవడం లేదని ఎక్స్ వేదికగా నిలదీశారు. తెలంగాణ పట్ల కేంద్రం మిగతాది 2 లో...

# రెడ్‌బుక్ తెరవక ముందే ఢిల్లీలో గగ్గోలు

- అదేదో అసెంబ్లీకి వచ్చి చేస్తే..సమాధానం ఇచ్చేవాళ్లం
- జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి లోకేశ్



అమరావతి,జూలై26(ఆర్ఎన్ఎ): ఇంకా రెడ్ బుక్ తెరవక ముందే జగన్ ఢిల్లీ దాకా వెళ్లి గగ్గోలు పెడుతున్నారంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు చేశారు. పీవీ నరసింహారావుకు భారతరత్నపై స్పందించమని జాతీయ మీడియా కోరితే విజయసాయి పేరు చెప్పి వెళ్ళిపోయారన్నారు. రెడ్‌బుక్‌కు మాత్రం జాతీయ మీడియా వెంటపడి

# పపులు మీరు ఆన్ చేస్తారా..మమ్ములను చేయమంటారా?

❖ అసెంబ్లీ ముగిసేలోగా కాళేశ్వరం పంపులు ఆన్ చేయండి ❖ లేకుంటే రైతులతో వచ్చి మేమే ఆన్ చేస్తాం ❖ కెసిఆర్‌ను బద్నాం చేసేందుకే కాంగ్రెస్ డ్రామాలు ❖ రోజుకు 2 టిఎంసిలు ఎత్తి పోసే అవకాశం ❖ ప్రాజెక్టులను నీటితో నింపితే కరువుండదు ❖ కాళేశ్వరంపై సర్కార్‌కు కెటిఆర్ అల్టిమేటమ్ ❖ బిఆర్ఎస్ బృందంతో కలిసి పంపుహౌజుల పరిశీలన



హైదరాబాద్,జూలై26(ఆర్ఎన్ఎ): వచ్చే నెల 2వ తేదీలోపు కాళేశ్వరం పరిధిలోని జలాశయాల్లో నీటిని నింపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే 50 వేల మంది రైతులతో వచ్చి తామే పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ బీడు భూములను నీళ్లు అందిస్తామని స్పష్టం చేశారు. రాజకీయాల కోసం ప్రజలు, రైతులను ఇబ్బందులు పెట్టొద్దన్నారు. కేవలం మిగతాది 2 లో...

# నిరాశ కలిగించిన కాంగ్రెస్ బడ్జెట్

నిజామాబాద్ జిల్లాలో కేవలం 94వేల 566 మంది రైతులకు రూ.459 కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని మండిపడ్డారు. రైతు సంక్షేమం కోసం ప్రపంచంలోనే ఏ రాజకీయ పార్టీ, ఏ రాజకీయ నాయకుడు తలపెట్టని కార్యక్రమాలను కేసీఆర్ చేసి చూపించారని తెలిపారు. 60 ఏండ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ రైతుబంధు, రైతుబీమా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వానకాలం సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.7500 చొప్పున రైతుభరోసా ఇవ్వాల్సి ఉండగా రూ.11,250 కోట్లు ఎగ్గొట్టి ఆ డబ్బులతో రుణమాఫీ కింద రూ.6098 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఏదో ఘనకార్యం చేసినట్లుగా గోబెల్స్ ప్రచారాన్ని కాంగ్రెస్ చేస్తుండడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఈ మోసానికి రైతులు సంబురాలు చేసుకోవాలా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రం మొత్తం రుణమాఫీని 37లక్షల మంది రైతులకు వర్తింపజేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు, లోన్ రీషెడ్యూల్, ఆదాయ పన్ను పేరిట కొర్రీలు పెట్టి 26లక్షల మంది రైతులను ఏరి పారేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు కేవలం 11లక్షల మంది రైతులకు కుదించి రుణమాఫీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగాలు చేసుకునే రైతు కుటుంబాలు, చిన్న వ్యాపారాలు చేసుకునే రైతులకు కూడా రుణమాఫీ అమలు చేయాలని వేముల డిమాండ్ చేశారు

# తెలంగాణ యువతకు అండగా ప్రభుత్వం




తల్లిదండ్రులు గుండెలనిండా సంతోషిస్తున్నారని అన్నారు. సమాజాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో ముందుకు వచ్చిన మీ అందరినీ అభినందిస్తున్నానని రేవంత్ అన్నారు. తమ ప్రభుత్వం ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళు తోందన్నారు. అందులో భాగంగానే విద్య, వ్యవసాయానికి బడ్జెట్ లో అత్యధిక నిధులు కేటాయించామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా విద్య, వైద్యానికి బడ్జెట్ లో ప్రాధాన్యతనిచ్చామని పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీఖు జీతం అందించి ఉద్యోగులకు ప్రభుత్వం పై విశ్వాసం కల్పించామని రేవంత్ తెలిపారు. 90 రోజుల్లో మరో 30 వేల ఉద్యోగాలను భర్తీ చేయబోతున్నామన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది తిరగకముందే 60 వేలకు పైగా ఉద్యోగాలు అందించి నిరుద్యోగుల్లో విశ్వాసం కల్పిస్తున్నామ న్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తూ ముందుకెళతామన్నారు. నిరుద్యోగులకు, విద్యార్థులకు ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఒక సూచన చేశారు. వారికి ఏవైనా సమస్యలు ఉంటే మంత్రులు, ఎమ్మెల్యేలకు విన్నవించాలని రేవంత్ తెలిపారు. మీ సమస్యలను పరిష్కరించేందుకు మీ రేవంతన్నగా మీకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో తెలంగాణ ఫైర్ సర్వీసెస్ అండ్ సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ లో ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్ కు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# సైనికుల త్యాగాలను దేశం మరవదు

పడ్డారు. ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలిస్తామని దాయాది దేశాన్ని మరోసారి గట్టిగా హెచ్చరించారు. గతంలో పాకిస్థాన్ పాల్పడిన వికృత ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయినా, చరిత్ర నుంచి ఆ దేశం ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదు సరికదా.. ఉగ్రవాదం, ప్రాక్సీ వార్‌తో ఇంకా మనపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ రోజు నేను మాట్లాడే మాటలు.. ఉగ్రవాదులను తయారుచేస్తున్న వారికి నేరుగా వినబడతాయి. ముష్కరులను పెంచి పోషిస్తున్న వారికి నేను చెప్పేది ఒక్కటే.. వారి దుర్మార్గపు కుట్రలు ఎన్నటికీ ఫలించవు. మా దళాలు ఉగ్రవాదాన్ని నలిపివేసి.. శత్రువులకు తగిన జవాబిస్తాయి అని మోదీ పాక్‌ను హెచ్చరించారు. కార్గిల్ యుద్ధానికి లద్దాఖ్ సాక్షిగా నిలుస్తుంది. అమరుల త్యాగాలకు గుర్తుగా విజయ్ దివస్ జరుపుకుంటున్నాం. మన బలానికి, సహనానికి, వాస్తవాలకు ఈ విజయగాథ నిదర్శనం. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన సైనికులు చిరకాలం గుర్తుండిపోతారు. కార్గిల్ యుద్ధ సమయంలో సామాన్యుడిగా సైనికుల మధ్య ఉండే అదృష్టం నాకు దక్కింది. దేశం కోసం వారు చేసిన పోరాటం నా మదిలో నిలిచిపోయింది. లద్దాఖ్, జమ్మూకశ్మీర్ అభివృద్ధి కోసం ఎలాంటి సవాళ్లనైనా భారత్ అధిగమిస్తుంది. మరికొద్ది రోజుల్లో ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదేళ్లు పూర్తవుతాయి. ఇప్పుడు జమ్మూకశ్మీర్ ప్రజలు సరికొత్త భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్నారు. పెద్ద కలల గురించి మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం కశ్మీర్ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు నిలయంగా ఉంది. ఈ భూలోక స్వర్గం శాంతి, సౌభ్రాతృత్వం వైపు వేగంగా పరిగెడుతోందని మోదీ తెలిపారు. అంతకుముందు, యుద్ధ స్మారకం వద్ద కార్గిల్ అమరవీరులకు ప్రధాని నివాళులర్పించారు. వీర జవాన్ల కుటుంబసభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా షింకున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ నిర్మాణపనులను ప్రధాని మోదీ ప్రారంభించారు. టన్నెల్ నిర్మాణ ప్రాంతం వద్ద వర్చువల్‌గా తొలి బ్లాస్ట్ చేశారు. 4.1 కిలోమీటర్ల పొడవైన ఈ ట్విన్ ట్యూబ్ టన్నెల్‌ను 15,800 అడుగుల ఎత్తులో నిర్మించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సాయుధ దళాలను వేగంగా తరలించేందుకు, సైనిక సామగ్రిని చేరవేసేందుకు ఈ సొరంగం సమర్థంగా ఉపయోగపడనుంది. దీని నిర్మాణం పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సొరంగంగా గుర్తింపు సాధించనుంది.పొరుగు దేశం పాకిస్థాన్‌కు ప్రధాని మోదీ వార్నింగ్ ఇచ్చారు. 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ద్రాస్ సెక్టార్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాకిస్థాన్ నేరాలకు పాల్పడి గతంలో విఫలం అయ్యిందని, కానీ ఆ చరిత్ర నుంచి ఆ దేశం ఏమీ నేర్చుకోలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, ప్రచ్ఛన్న యుద్ధంతోనే ఆ దేశం జీవనం చేస్తోందని విమర్శించారు. తాను మాట్లాడే ప్రదేశం నుంచి ఉగ్రదాడులకు పాల్పడుతున్న ముఠా నేతలు తన స్వరాన్ని నేరుగా వింటారని, ఉగ్రవాదానికి ఊతం ఇస్తున్న దేశాలకు ఓ విషయాన్ని చెప్పదలుచుకున్నానని, ఆ దేశ కుంచిత ఆలోచనలు ఎన్నటికీ విజయవంతం కావు అని ప్రధాని తెలిపారు. పూర్తి స్థాయి దళాలతో ఉగ్రవాదుల్ని మా సైనికులు అణిచివేస్తారని, శత్రువుకు బలమైన సమాధానం ఇస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. లడాఖ్ అయినా, జమ్మూకశ్మీర్ అయినా, అభివృద్ధికి అడ్డు వచ్చే ఎటువంటి సవాల్‌ను అయినా ఇండియా ఓడిస్తుందని మోదీ అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఆగస్టు 5వ తేదీ నాటికి అయిదేళ్లు అవుతుందని, జమ్మూకశ్మీర్ ప్రజలు కొత్త భవిష్యత్తు, కొత్త కలల గురించి మాట్లాడుకుం టున్నారని తెలిపారు. మౌళిక సదుపాయాల అభివృద్ధి, పర్యాటక రంగం.. లడాఖ్, జేకేలో వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. కశ్మీర్‌లో కొన్ని దశాబ్దాల తర్వాత సినిమా హాల్‌ను ఓపెన్ చేసినట్లు చెప్పారు. 35 ఏళ్ల తర్వాత శ్రీనగర్‌లో తాజియా ఊరేగింపు జరిగిందన్నారు.

# నీతి ఆయోగ్ సమావేశ బహిష్కరణ

అనుసరిస్తున్న పక్షపాత వైఖరికి నిరసనగా నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు అప్పట్లో సీఎం కేసీఆర్ ప్రకటిస్తే పీసీసీ అధ్యక్షునిగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తప్పుపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానిని నిలదీయడానికి నీతి అయోగ్ సమావేశం ఒక మంచి అవకాశమని వాదించారు. ఆ సమావేశానికి సీఎం కేసీఆర్ వెళ్లాలని డిమాండ్ చేశారు. అదే రేవంత్‌రెడ్డి ఇప్పుడు సీఎంగా కేంద్ర బ్జడెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తు న్నట్టు బుధవారం శాసనసభలో ప్రకటించిన విషయం తెలిసిందే. నీతి అయోగ్ సిఫారసులకు కేంద్రం విలువ ఇవ్వనప్పుడు ఆ సమావేశానికి వెళ్లడంలో అర్థం లేదనే బహిష్కరిస్తున్నట్టు రెండేండ్ల కిందట సీఎం కేసీఆర్ ప్రకటించారు. మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్ల గ్రాంట్, మిషన్ భగీరథకు రూ.19,500 కోట్ల గ్రాంట్ తెలంగాణకు ఇవ్వాలని నీతి అయోగ్ చేసిన సిఫారసును కేంద్రం పట్టించుకోకపోవడంతో.. నిరసనగా నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు కేసీఆర్ వివరించారు. కేంద్రం వైఖరిని తప్పు పట్టాల్సింది పోయి అప్పుడు పీసీసీ అధ్యక్షునిగా ఉన్న రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్ నిర్ణయాన్నే తప్పుపట్టారు

# స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు శోచనీయం



**హైదరాబాద్,జూలై26(ఆర్‌ఎన్‌ఎ):** ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై విమర్శలు కొనసాగుతున్నాయి. తన వ్యాఖ్యలపై ఆమె క్షమాపణలు చెప్పాలన్న డిమాండ్‌ను పట్టించుకోవడం లేదు. తాజాగా తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఆచార్య కోదండరాం మండిపడ్డారు. దివ్యాంగులపై ఆమె చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వైకల్యం పేరుతో వారి హక్కులను హరించడం సరైంది కాదన్నారు. దివ్యాంగులు కొన్ని ఉద్యోగాలకు పనికిరారని స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. వాళ్లు సకాలంగుల కంటే ఎంతో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. చట్టాలను అమలు చేయాల్సిన ఏఐఎస్ అధికారిణి వైకల్యాన్ని కించపర్చడం సమంజసం కాదని అన్నారు. స్మితా సబర్వాల్.. తను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోగా.. సమర్థించుకోవడం శోచనీయం అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోదండరాం అన్నారు.

# రాష్ట్ర అప్పులపై సీఎం అబద్దాలు

ఎన్నికల సమయంలో 14 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని చెబుతూ.. సూపర్ సిక్స్ హామీలు జగన్ విమర్శించారు. 'ఇప్పుడు అధికారం వచ్చాక అది చూపించడానికి ఇబ్బందులు పడుతున్నారు. గవర్నర్ ప్రసంగంలో రూ.10 లక్షల కోట్ల అప్పు అయ్యిందని చూపించారు. శ్వేత పత్రాలతో మభ్య పెట్టే యత్నం చేస్తున్నారు. ఆర్బీఐ, కాగ్, రాష్ట్ర బ్జడెట్ లెక్కల ప్రకారం 2024 జూన్ వరకు కూటమి సర్కార్ గద్దెనెక్కేవరకు రూ.5 లక్షల 18 వేల కోట్ల అప్పు మాత్రమే అయింది. చంద్రబాబు హయాంలో 21.63 శాతం దాకా అప్పు చేశారు. వైసీపీ హయాంలో 12.9 శాతం అప్పు చేశాం. కేంద్ర ఆర్థిక సర్వే మా ప్రభుత్వ పని తీరును మెచ్చుకుంది. బ్జడెట్‌లోనూ ఈ లెక్కలన్నీ చెప్పాల్సి వస్తుందనే పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టడం లేదు. 14 లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పడం సరికాదు' అని జగన్ అన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఎటు వైపు వెళ్తుందో ఆలోచించాలని, పురోగతి వైపు వెళ్తుందా?.. తిరోగమనంలో వెళ్తోందా? గమనించాలని ఏపీ ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ఇచ్చారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచకాలు, చంద్రబాబు విడుదల చేస్తున్న అబద్ధపు శ్వేత పత్రాలు, వైఎస్సార్‌సీపీ హయాంపై చేస్తున్న తప్పుడు ప్రచారాలపై తాడేపల్లిలోని తన కార్యాలయంలో జగన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో గత 52 రోజులుగా దాడులు, అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం కొనసాగుతోంది. ప్రశ్నించే వాళ్లను అణచివేసే ధోరణితో పాలన ముందుకు సాగుతోంది. విధ్వంస పాలన కొనసాగుతుంటే.. పోలీసులు పూర్తిగా ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏడు నెలల ఓటాన్ బ్జడెట్ పెడుతోంది. పూర్థిస్థాయి బ్జడెట్ పెట్టే ధైర్యం లేంటే ఎంతటి దారుణమైన, అధ్వానమైన పాలనో అర్థం చేసుకోవాలి. ఫుల్ బ్జడెట్ పెడితే చంద్రబాబు నాయుడు మోసపూరిత హామీలు ఏవైతే ఇచ్చారో.. వాటికి కేటాయింపులు చూపించాల్సిన అవసరం వస్తుంది. అందుకే ఆ పని చేయడం లేదు. చంద్రబాబు 2019లో దిగిపోయే నాటికి రూ.2 లక్షల 72 వేల కోట్ల అప్పు ఉంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఆ అప్పు రూ.5 లక్షల 18 వేల కోట్లకు చేరింది. గ్యారెంటీలు, విద్యుత్ ఒప్పందాలు కలిపినా రూ. 7లక్షల 48 వేల కోట్లు మాత్రమే. అయినా గవర్నర్ ప్రసంగంలో అబద్ధం చెప్పించారు. ఇలా రూ. 14 లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పడం ధర్మమా?. వాస్తవాలపై గవర్నర్‌కు లేఖ రాస్తాం. ఆయనతోనూ అబద్దాలు చెప్పించిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తాం. చంద్రబాబు అధికారం చేపట్టేనాటికి రూ.7 వేల కోట్లకు పైగా ఖజానా సొమ్ము ఉంది. కానీ, మేం అధికారం చేపట్టేనాటికి రూ.100 కోట్లే ఉంది. ఆ విషయాన్ని ఈనాడు కూడా రాసింది. మేం అధికారంలో ఉండగా మేనిఫెస్టోలో ప్రతీ హామీని అమలు చేశాం. డీబీటీ ద్వారా బటన్ నొక్కి రూ.2.71 లక్షల కోట్లు లబ్ధిదారులకు జమ చేశాం. పార్టీ, ప్రాంతాలు కూడా చూడకుండా అందరికీ సంక్షేమం అందించాం. చంద్రబాబు హయాంలో 21.63 శాతం దాకా అప్పు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 12.9 శాతం అప్పు చేశాం. కేంద్ర ఎకనామిక్ సర్వే మా ప్రభుత్వ పని తీరును మెచ్చుకుంది. అయినా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆగమైనట్లు చిత్రీకరించడం ఎంత వరకు సమంజసం?. బ్జడెట్‌లోనూ ఈ లెక్కలన్నీ చెప్పాల్సి వస్తుందనే పూర్తిస్థాయి బ్జడెట్ పెట్టడం లేదు. అసలు లేని రూ.14 లక్షల కోట్ల అప్పు ఉందని చెప్పడం ధర్మమా?. చంద్రబాబు హయాంలో 21.63 శాతం దాకా అప్పు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 12.9 శాతం అప్పు చేశాం. కేంద్రం ఇచ్చిన అనుమతుల కన్నా తక్కువ అప్పే చేశాం. కోవిడ్ టైంలోనూ పూర్తి స్థాయి బ్జడెట్ పెట్టాం. ఆ టైంలో కేంద్రం నుంచి పన్నుల వాటా తగ్గింది. అయినా సంక్షేమం ఆపలేదు. ఈ లెక్కన ఎవరు ఆర్థికంగా ధ్వంసం చేసినట్లు? కేంద్ర ఎకనామిక్ సర్వే మా ప్రభుత్వ పని తీరును మెచ్చుకుంది. కేవలం.. బ్జడెట్‌లోనూ ఈ లెక్కలన్నీ చెప్పాల్సి వస్తుందనే చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టడం లేదన్నారు. 2019-24మధ్య రాష్ట్రంలో భారీగా జరిగిన ఆర్థిక నిర్వహణ లోపాలపై శ్వేతపత్రాన్ని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నేడు సభ ముందు ఉంచారు. అయిదేళ్ల పాటు పట్టిసీమను ఆపరేట్ చేయలేదని వెల్లడించారు.

# తగ్గుతున్న బంగారం ధరలు

వర్తకులు చెబుతున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే సుమారు 20 శాతం మేర డిమాండ్ పెరిగినట్లు పేర్కొంటున్నారు. నగల గురించి ఆరా తీసే వారి సంఖ్య కూడా పెరిగిందంటున్నారు. దీంతో కొన్ని సంస్థలు ఆభరణాల తయారీదారుల సెలవులు కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఎప్పటినుంచో బంగారం కొనాలనుకుంటున్నవారంతా ఇప్పుడు తమ కలను సాకారం చేసుకుంటున్నారని వర్తకులు చెబుతున్నారు. అయితే, ఒకేసారి డిమాండ్ పెరిగితే ప్రభుత్వం ఎక్కడ మళ్లీ సుంకాన్ని పెంచుతుందోనన్న భయాలూ కొందరు వర్తకుల్లో నెలకొనడం గమనార్హం. బడ్జెట్ తర్వాత స్థానిక మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర దాదాపు రూ.5 వేల మేర దిగొచ్చింది. కస్టమ్స్ సుంకాన్ని భారీగా తగ్గించడమే దీనికి ప్రధాన కారణం. దీంతో నగల దుకాణాల్లో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. మరికొన్ని రోజుల్లో పండగల సీజన్ ప్రారంభం కానున్నవేళ బంగారాన్ని కొనుగోలు చేసేందుకు జనం పోటీపడుతున్నారు. బంగారం ధర భారీగా తగ్గిన నేపథ్యంలో బంగారంలో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. బంగారంపై కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడంతో దిగుమతి భారం తగ్గింది. పసిడి అక్రమరవాణాను అరికట్టేందుకు సుంకం తగ్గించాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. ఈ నేపథ్యంలో సుంకాన్ని తగ్గించడంతో సుమారు కిలోకు రూ.3.90 లక్షల వరకు ధర తగ్గడం గమనార్హం. బ్జడెట్ తర్వాత 10 గ్రాముల బంగారం మీద రూ.5 వేలు మేర తగ్గింది. అటు వెండి కిలోకు రూ.7 వేల వరకు తగ్గి ప్రస్తుతం రూ.84 వేలు పలుకుతోంది. ధర తగ్గడం వల్ల రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి బంగారంపై పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొన్నారు. భౌతిక బంగారంగానే కాకుండా.. పెట్టుబడి సాధనంగానూ బంగారాన్ని పరిశీలించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణాన్ని, కరెన్సీ విలువ పతనాన్ని తట్టుకొని నిలబడగలిగే శక్తి పసిడికి ఉండడమే దీనికి కారణమని చెప్పారు. ఈ నిర్ణయం వల్ల స్మగ్లింగ్ మాఫియాకు అడ్డుకట్ట వేయడంతో పాటు వ్యవస్థీకృత మార్కెట్ ద్వారా ప్రభుత్వానికి జీఎస్టీ, ఆదాయపు పన్ను రూపంలో రెవెన్యూ సమకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. బంగారం ధరలో స్థిరత్వం అనేది అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయం, వివిధ దేశాల ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు.

# ఎల్‌ఆర్‌ఎస్ అమలుకు జిల్లాల వారీగా బృందాలు

## అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి ఆదేశాలు

**హైదరాబాద్,జూలై26(ఆర్‌ఎన్‌ఎ):** లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం ఎల్‌ఆర్‌ఎస్)అమలు కోసం కొత్త జిల్లాల వారీగా బృందాలు ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ అమలుపై సచివాయలంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా అమలు చేయాలని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ విధివిధానాల కసరత్తుపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 39 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు. జిల్లాల వారీగా బృందాలు ఏర్పాటు చేయాలని, సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల, శాఖల ముఖ్యకార్యదర్శులు నవీన్ మిత్తల్, జ్యోతి బుద్ధ ప్రకాష్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



## మమ్ములను చేయమంటారా?

రాజకీయ కక్షతో, కేసీఆర్‌ను బద్నాం చేయాలనే తలంపుతో పంపులను ఆన్ చేయడం లేదని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లోపు కాళేశ్వరం పంప్‌హౌస్‌లు ఆన్ చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కన్నెపల్లి లక్ష్మీ పంప్ హౌస్‌ను కేటీఆర్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ కల్పతరువన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులం ప్రాజెక్టును పరిశీలించామని చెప్పారు. 'దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయనంత వేగంగా కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారు. తెలంగాణలో కరువు అనే మాట వినపడొద్దని ఈ ప్రాజెక్టును నిర్మించారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎప్పుడూ నీటి సమస్య లేదు. గతంలో నీటి సమస్య ఉండేదని రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తున్నది. ఈ ప్రభుత్వం పంటల సాగు కోసం నీరు ఇచ్చే పరిస్థితి లేదు. శ్రీరాంసాగర్‌లో నీళ్లు లేవు, ఎల్‌ఎండీలో 5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. మిడ్ మానేరులోనూ 5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. శ్రీరాంసాగర్ సామర్థ్యం 90 టీఎంసీలు అయితే ఇప్పుడు 25 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో కరువు ప్రాంతాలకు సాగునీరు అందుతుంది. హైదరాబాద్‌కు కూడా మంచినీళ్లు అందించొచ్చు. 15 టీఎంసీలతో కొండ పోచమ్మ సాగర్ కట్టుకున్నం. 50 టీఎంసీలతో మల్లన్న సాగర్ కట్టుకున్నం. లక్ష్మీ పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూడు రోజులకు ఒకసారి తాగునీరు అందిస్తున్నారు. పది లక్షల క్యూసెక్కుల నీరు వృధాగా కిందకు పోతున్నాయి. కాళేశ్వంరం దగ్గర గోదవారి ఉధృతంగా ప్రవహిస్తున్నది. రిజర్వాయర్లు మాత్రం గొంతెండి ఎడారిలాగా మారాయని అన్నారు. ఇంత గొప్ప సిస్టమ్ రూపొందించడం మరొకరి వల్ల కాదు. 17 పంపులు రెడీగా ఉన్నాయి. రోజుకు 2 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు. రాజకీయ పరమైన నిర్ణయం వల్లే నీటిని ఎత్తిపోయడంలేదు. ప్రభుత్వం తలచుకుంటే 18 లక్షల ఎకరాలకు నీళ్లివ్వొచ్చు. నీళ్లు సముద్రంలోకి వృధాగా పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బస్వాపూర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్, మల్లన్న సాగర్ రైతులు నీటికోసం ఎదురుచూస్తున్నారు. తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట వరకు రైతులు కాళేశ్వర జలాల కోసం ఎదురుచూస్తున్నరు. ఆరు నెలలు రాజకీయం చేద్దాం.. నాలుగున్నరేండ్లు ప్రజల కోసం కష్టపడి పనిచేద్దామని అన్నారు. నీటిని లిఫ్ట్ చేస్తే రెండు రోజుల్లో మిడ్ మానేరుకు చేరుకుంటాయి. కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, అన్నపూర్ణ రిజర్వాయర్లు నింపొచ్చు. మిడ్‌మానేరు గత ఐదారేండ్లు నిండుగా ఉంది. ఇప్పుడు ఎడారిగా మారింది. పంప్‌హౌస్‌లపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు కాంగ్రెస్ చిల్లర ప్రయత్నాలు చేస్తున్నది. ప్రజలకు ఈ విషయాలన్నీ అర్థమైపోయినయి. రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చకు డిమాండ్ చేస్తం. కాళేశ్వరంలో పరిధిలో రిజర్వాయర్లలో నీటిని నింపడానికి ప్రభుత్వానికి ఆగస్టు 2 వరకు గడువిస్తున్నాం. సర్కార్ స్పందించకపోతే 50 వేల రైతులతో తామే పంపులు ఆన్ చేస్తం. తెలంగాణ బీడు భూములకు నీళ్లు అందిస్తం. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అసెంబ్లీలో నిలదీస్తం. రాజకీయాల కోసం ప్రజలు, రైతులను ఇబ్బందులు పెట్టొద్దు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అని ప్రపంచమంతా గుర్తించింది. ఎందరో మేధావులు కాళేశ్వరం గొప్పతనాన్ని ప్రశంసించారు. చిన్న సమస్య తలెత్తితే ప్రాజెక్టుపై విషప్రచారం చేస్తున్నారు. మహారాష్ట్రతో ఒప్పందం చేసుకుని అద్భుతమైన ప్రాజెక్టును నిర్మించాం. అన్నారం, సుందిళ్లపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసింది. గ్రౌడింగ్ అనేది నిరంతరం పక్రియ, 2020లోనూ చేశామని ఇంజినీర్లు చెప్పారు. రైతుల మీద కాంగ్రెస్ రాజకీయాలు బంద్ చేయాలి. కేసీఆర్ ఇంతగొప్ప ప్రాజెక్టును నిర్మిస్తే వాడుకునే తెలివి కాంగ్రెస్‌కు లేదు.' అని కేటీఆర్ విమర్శించారు. న్నెపల్లిలో నీటి లభ్యత ఎక్కువ అని కేసీఆర్ గుర్తించారని, అందుకే అక్కడ పంప్ హౌస్ కట్టారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. సమైక్య పాలకులు ప్రాణహిత కలిసిన తర్వాత గోదావరిపై ఎక్కడా ప్రాజెక్టు కట్టలేదని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీలో చిన్న లోపం.. ప్రపంచంలో ఎక్కడైనా జరుగుతాయన్నారు. ఆ చిన్న లోపాన్ని అడ్డంపెట్టుకుని కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేశాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండున్నర వేల క్యూసెక్కుల నీళ్లు వస్తే ఒక మోటర్ ఆన్ చేయొచ్చని తెలిపారు. నీటిని ఎత్తిపోస్తే చివరి సూర్యాపేట, డోర్నకల్ వరకు నీళ్లు అందించవచ్చని చెప్పారు. కేసీఆర్‌ను బద్నాం చేసి బతకాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అన్న ÷ర్ అయ్యారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి రైతుల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగానే నీటి ఎత్తిపోతను ఆపారని ఆరోపించారు. ఎల్‌ఎండీ, మిడ్ మానేరులో టీఎంసీలకు పైగా నీళు ండేవని, ఇప్పుడు అసలు నీటి జాడే లేదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కాళేశ్వరం నుంచి ప్రభుత్వం వెంటనే నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. కెటిఆర్ వెంట సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, మల్లారెడ్డి, కౌశిక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

www.telanganasahithi.com
RNI:TELTEL/2015/64477
తెలంగాణ సాహితి
TELANGANA SAHITHI TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
PUBLISHED FROME : MAHABUBNAGAR
శనివారం 27-07-2024
http://www.telanganasahithi.com




## సైనికుల పోరాట పటిమ ఎంతో గొప్పది

- సైనికుల సేవలకి మనం వారికి ఏమి ఇచ్చిన తక్కువే..
- షాద్ నగర్ పట్టణంలో నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**షాద్ నగర్ /తెలంగాణ సాహితి /జులై 26**కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా షాద్ నగర్ మాజీ సైనికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతృభూమి పై ప్రతి ఒక్కరికి మమకారం ఉండాలి, దేశ రక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని అన్నారు. దేశ రక్షణ కోసం సైనికుల త్యాగాలు ఎంతో గొప్పవని కొనియాడారు

## మొక్కలు పంపిణీ భాద్యతగా చేయ్యండి



**తెలంగాణ సాహితి జూలై27వైరా మున్సిపాలిటీలో** పర్యావరణ పరిరక్షణలో భాగంగా వైరా మున్సిపాలిటీలో ఇంటింటికీ చేస్తున్న మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ అదికారులు, సిబ్బంది భారంగా భావించకుండా బాధ్యతగా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ రోజు సుందరయ్య నగర్ లో ఇంటింటికీ పంపిణీ చేసిన మొక్కలను మున్సిపాలిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా ఇండ్ల ముందు పడేయడం వలన చాలా మొక్కలు విరిగిపోయి పెంచడానికి పనికిరాకుండా పోయాయి. కొంతమంది నిర్లక్ష్యం మూలంగా ప్రజాధనం వృదా కావడంతోపాటు పర్యావరణ పరిరక్షణ లక్ష్యం మొక్కదశలోనే చనిపోతుంది. మొక్కలు పెంచడంతోపాటు పంచడం కూడా సామాజిక బాధ్యతగా భావించాలి. మొక్కల పంపిణీని మున్సిపాలిటీ అదికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షణ చేయాలని విజ్ఞప్తి

## ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం :
## కుండా భానుచందర్ ఆరోపణ



**తెలంగాణ సాహితి జూలై27 మేడ్చల్ జిల్లా** వృద్ధులకు సకాలంలో పెన్షన్లు అందడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పై బీ ఆర్ ఎస్ నేతలు కొందరు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని గుండ్ల పోచంపల్లి పరిధిలోని 5వ వార్డ్ కాంగ్రెస్ నేత కుండా భానుచందర్ ఆరోపించారు. స్థానిక పోస్ట్ ఆఫీస్ లో పింఛన్లు అందజేసే మిషన్లు మొరాయించడం వల్ల రెండు రోజులపాటు కొంత జాప్యం జరిగిందని స్వయంగా పోస్ట్ ఆఫీస్ సిబ్బంది సతీష్ ఈ విషయం వెల్లడించారని కుండ భానుచందర్ తెలిపారు. ప్రభుత్వం ప్రతినెల పెన్షన్లను సకాలంలోనే విడుదల చేస్తుందని, ఈ ఒక్క నెల లో మాత్రం పింఛన్లను అందజేసే మిషన్ జాప్యం వల్ల ఆలస్యమైందని పోస్ట్ ఆఫీస్ సిబ్బంది పేర్కొన్నారని కుండ భానుచందర్ తెలిపారు. పింఛన్ల కోసం వృద్ధులు ఉదయమే వచ్చి పోస్ట్ ఆఫీస్ ముందు కూర్చుంటే ఆ ఫోటోలను తీసి పింఛన్ల కోసం వృద్ధులు పడిగాపులు కాస్తున్నారు అంటూ సీఎం రేవంత్ రెడ్డిని భదనం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదని, కుండ భానుచందర్ పేర్కొన్నారు.

## ఏకత్వ పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్

ఎన్టీఆర్ జిల్లా జూలై 26 నందిగామ ప్రతినిధి జననేత్రం



**తెలంగాణ సాహితి:** వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలో గల ఏకత్వ పాఠశాలలో శుక్రవారం ఉదయం కార్గిల్ విజయ్ దివస్ ను నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ ఎన్ సూర్యవతి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో పోరాడిన సైనికుల గౌరవార్థం ప్రతి సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల ఫౌండర్ డైరెక్టర్ మనోజ్ అమరనేని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ ఈ కార్గిల్ దివస్ రోజును భారతదేశం అంతటా, జాతీయ రాజధాని న్యూఢిల్లీలో జరుపుకుంటారని, ఈ రోజుకి గొప్ప ప్రాముఖ్యత ఉందని భారత సాయుధ బలగాల ధైర్యసాహసాలు, అచంచలమైన అంకితభావాన్ని స్మరించుకునేందుకు పౌరులందరికీ ఇది ఒక అవకాశం అని అన్నారు. ఇక్కడ భారత ప్రధాని ప్రతి సంవత్సరం ఇండియా గేట్ వద్ద అమర జవాన్ జ్యోతి వద్ద సైనికులకు నివాళులర్పిస్తారని అన్నారు. భారత సాయుధ దళాల విరాళాలను స్మరించుకునేందుకు దేశవ్యాప్తంగా కూడా కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించి భారత సైనికులకు అంకితం చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కో ఫౌండర్స్ అమరనేని సింధూ, శాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రకాశం జిల్లా కలెక్టర్ ని కలిసిన నూతన ఎస్పీ దామోదర్



**తెలంగాణ సాహితి జూలై27 ప్రతినిది** ప్రకాశం జిల్లా// నూతన ఎస్పీ శ్రీ ఏఆర్ దామోదర్ ఐ.పి.యస్ గారు శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ. తమీమ్ అన్సారియా ఐఏఎస్ ని కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ కి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు, పోలీస్ శాఖ, పరిపాలక అధికార యంత్రాంగం మధ్య సమన్వయము, జిల్లాకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.




## రైల్వే స్టేషన్ ను పరీక్షించిన జనరల్ మేనేజర్



**జోగులాంబ గద్వాల జిల్లా తెలంగాణ సాహితి ప్రతినిధి** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గారు గద్వాల రైల్వే స్టేషన్ ను సందర్శించి నా సందర్భంలో సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కే మోహన్ రావు మరియు రాష్ట్ర మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు అచ్చన్నగౌడ్ గారు కలసి వినతి పత్రం అందజేస్తూ నీతి అయోగ్ ద్వారా గద్వాల రైల్వే స్టేషన్ ఆధీనంలో ఉన్న 120ఎకరాల స్థలములో ఒక మెడికల్ కాలేజీ ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేస్తే ఇక్కడ ప్రజలకే కాకుండా రాయచూర్ డివిజన్ మరియు గుంతకల్ డివిజన్ మహబూబ్నగర్ డివిజన్ వారి సౌకర్యార్థం తో పాటు ఇక్కడి ప్రజలకు అనుకూలంగా ఉంటుందని అదేవిధంగా గద్వాల గద్వాల జోగులాంబ జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తుంది కనుక 187 కిలోమీటర్ మేళ్లచెరువు గ్రామం దగ్గర రైల్వే ఓవర్ బ్రిడ్జి వేస్తే ఔటర్ రింగ్ రోడ్డుకు ఆస్కారం ఉంది ఎర్రబెల్లి నుంచి రాయచూర్ మరియు ఐజ నుంచి మంత్రాలయం తదితర ప్రదేశాలకు రవాణా సౌకర్యము ఇటు కర్ణాటక అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు మెరుగుపడుతుందని విన్నవించగా వారు సానుకూలంగా స్పందించి పై అధికారులకు తెలుపుతామని అందులో పొందుపరిచిన అంశము రైల్వే బోర్డుకు కూడా తెలిపే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు అదేవిధంగా గద్వాల జంక్షన్ ఇప్పటికే కాదు రాజుల సంస్థానం ఉన్నప్పుడే గద్వాల జంక్షన్ గా ఏర్పడిందన్నారు ప్రస్తుతము చాలా ఎక్స్ప్రెస్ రైలు ఇక్కడి నుంచి ట్రైన్స్ కర్ణాటక తమిళనాడు ఆంధ్ర ప్రాంతాలకు వెళ్లే అన్ని రైళ్లు ఇక్కడ ఆపాలని బోర్డు దృష్టిలో తేవాలని సరితా తిరుపతయ్య మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి గారి వినతి పత్రాన్ని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్పీ అచ్చన్న గౌడ్ గారు ఆమె తరపున జనరల్ మేనేజర్ గారిక అందజేసినారు దానికి వారు సానుకూలంగా స్పందించినారు

## ఉచిత విద్య పై జీవో జారీకి కృషి
## జర్నలిస్టుల సమస్యల పై కుల రహితంగా పోరాటంచెయ్యాలి

**టీ యూడబ్ల్యూజే (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి: గుంట్రాతి. మధు**




**అచ్చంపేట, జులై 26(తెలంగాణ సాహితి),:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తూ వాటిని సాధించుకునే దిశగా యూనియన్ ల రహితంగా ముందుకు వెళ్తామని టి యు డబ్ల్యూ జె, ఐజేయూ, రాష్ట్ర కార్యదర్శి,గుంట్రాతి. మధు గౌడ్ అన్నారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రెస్ క్లబ్ లో ఆయనమీడియాతో మాట్లాడుతూ.. అక్రిడేషన్ కార్డు ప్రతి ఒక్కరికి ఉండాలని టియుడబ్ల్యూజే (ఐజేయు)పాటుపడుతుందన్నారు. జర్నలిస్టు వృత్తి అతి పవిత్రమైనదని దానిని అగౌరవ పరచకుండా ప్రజా సంక్షేమం కోసం అందులో మన వంతు పాత్ర పోషించాలని ఆయనసూచించారు. విధి నిర్వహణ లో ఏ జర్నలిస్టు అయినా మృతి చెందితే ఆ జర్న లిస్టు కుటుంబం బ్రతుకు దెరువు కొరకు 5, లక్షల రూపాయలను ఇచ్చే విధంగా ప్రభుత్వం నుంచి ప్రెస్ అకాడమి ఛైర్మన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని జర్నలిస్టులు కోరారు.

**ఉచిత విద్యపై జీవో కోసం కృషి..**

జర్నలిస్టుకుటుంబాల పిల్లల కోసం ప్రభుత్వమే ఒక జీవోను విడుదల చేసి ఉచిత విద్యను అందించేలా రాష్ట్ర అధ్యక్షులు, విరాహత్ అలీ సూచన మేరకు త్వరలో ప్రెస్ అకాడమీ చైర్మన్ సీఎంతోచర్చించనున్నారని గుర్తు చేశారు. అక్రిడేషన్ కార్డుల జారీ మూడు నెలల వాయిదా వేయడానికి ప్రధాన కారణం అదే కార్డు లోనే హెల్త్ కార్డు అంశాన్ని చేరుస్తూ అది అమలయేలా రూపకల్పన జరిగేందుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగేదీర్ఘకాలికంగాఉన్నపాత్రికేయుల సమస్య ఇంటి స్థలాల పంపిణీ, జరిగేలా మండల, తాలూకా, జిల్లాల పాత్రికేయులకు ప్రభుత్వం స్థలాలు కేటాయించేలా చర్యలుతీసుకోవాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వానికిప్రతిపాదనలు పంపారని అదికూడాత్వరలోనే పరిష్కారం అయ్యే అవకాశంఉందన్నారు.జర్నలిస్టు లు విధి నిర్వహణ లో మృతి చెందితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం నుంచి 5లక్షల రూపాయల ను ఇప్పించే విధంగా ప్రెస్ అకాడమి ఛైర్మన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు పోతా మని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి న మొదటిసారి శిక్షణ తరగతులు.ప్రెస్ అకాడమీ ద్వారా రాష్ట్రంలో మొదటిసారిగా నల్లమల్ల ప్రాంతంలోని జర్నలిస్టుల కోసం రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సానుకూలంగా ఉన్నారని అందుకు స్థానికంగా ఉన్న పాత్రికేయులందరూ యూనియన్లతో సంబంధం లేకుండా అందరూ సమన్వయంతో ముందుకు వచ్చినట్లయితే రాబోయే రెండు నెలల్లో శిక్షణా ల తరగతులను నిర్వహించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మిర్యాల .కర్ణయ్య, కౌన్సిల్ సభ్యులు శ్యాంసుందర్, అ క్రిడేషన్ కమిటీ మెంబర్లు మాధవరెడ్డి, పవన్ కుమార్,శ్యాం , సంబు.చంద్ర శేఖర్, వెంకటయ్యరాఘవేందర్, తాహర్, కృష్ణయ్య, లక్ష్మీ పతి, రవి, భరత్, అంజనే యులు, కే ఎల్ నారాయణ,తదితరులు ఉన్నారు.

## సామాన్య ప్రజల తరపున మేమున్నాం



**హైదరాబాద్(తెలంగాణ సాహితీ)** జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఎంతోమంది పేదవారు తన ఆర్థిక పరిస్థితిని అనుకూలంగా మలుచుకొని పొట్ట కొట్టి సంపాదిస్తున్నారు కొందరు. వ్యాపారస్తులు బ్రతుకు భారాన్ని మోయలేక అటువంటి పెత్తందారులతో పోరాడలేక చితికిపోతున్నటువంటి పేద బతుకులు కోసమే నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఉన్నది అని తెలియజేశారు. ఇప్పటికీ కూడా చాలా ట్రైబల్ ఏరియాలో పది రూపాయలు వస్తువుని మూడు రూపాయలు కూడా కొట్టేసే వ్యాపారవేత్తలు ఎక్కువయ్యారు. ఇప్పటికైనా మీ సమస్యలని మా ముందుకు తెస్తే నీకోసం మేమున్నామని తెలియజేశారు. సామాన్య ప్రజల కోసం మా సంస్థ చట్టాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలియజేస్తూ ఆ యొక్క చట్టాలను వివరించారు. సెక్షన్ 6,(1) సమాచారం కోరే హక్కు దసెక్షన్ 4,( 1 )బి ప్రకారం నెలవారి జీతభత్యాలను సైతం ప్రజలకు తెలపాల్సిందే సెక్షన్ 6, (3) ప్రకారం వారిది కానీ వారిది కాని సమాచారాన్ని మరో కార్యాలయానికి పంపవలసిన బాధ్యత అధికారులదే. సెక్షన్ 7(1) ప్రకారం 30 రోజులు లోపు సమాచారం ఇవ్వాల్సిందే. వ్యక్తి జీవితానికి స్వేచ్ఛకు సంబంధించినదైతే 48 గంటల్లోపే ఇవ్వాలి. సెక్షన్ 19(8 ) బి .ప్రకారం దరఖాస్తుదారునికి నష్టపరిహారం వస్తుంది. సెక్షన్స్ 6(2 )ప్రకారం సమాచారం అడిగే హక్కు మనది నీకెందుకు అని అడిగి హక్కు అధికారులకు లేదు . సెక్షన్ 21 (1) ప్రకారం దరఖాస్తు స్వీకరించినందుకు తిరస్కరించిన. తప్పుడు అసంపూర్తి. తప్పు దోవ పట్టించే సమాచారం ఇచ్చిన అధికారులకు 25000 జరిమాను ఇదించబడును. సెక్షన్ 2 జె( 1) ప్రకారం ప్రజలందరూ ప్రభుత్వ రికార్డులను తనిఖీ చేయవచ్చు. పిన్ 7(6) ప్రకారం 30 రోజులు దాటాక వచ్చే సమాచారం ఉచితం. సెక్షన్ 8(3 )ప్రకారం గడిచిన ఎన్ని సంవత్సరాల సమాచారం అయినా కోరవచ్చు. సెక్షన్ 4(4)ప్రకారం మాతృభాష తెలుగులో సమాచార ఇవ్వాల్సిందే. సెక్షన్ 18 (3) ప్రకారం అధికారులే కమిషనర్ ఎదుట స్వయంగా తప్పనిసరిగా హాజరు కావాలి. సెక్షన్ 2 జె (11) ప్రకారం ప్రతి పేజీని అధికారులు ధ్రువీకరించి ఇవ్వాలి. అని కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఫౌండర్ నాగేశ్వరరావు ప్రజల కోసం ఇన్ని చట్టాలు సెక్షన్లు కమిషన్ లో ఉన్నాయని అన్నారు. ప్రజల కోరితే ఏ ప్రభుత్వం అయినా సమాచారం ఇవ్వాల్సిందే ఇది 12 అక్టోబర్ 2005 అమల్లోకి వచ్చిన సమాచార హక్కుల చట్టమని చెప్పుకొచ్చారు.

4
Www.telanganasahithi.com
RNI:TELTEL/2015/64477
తెలంగాణ సాహితి
TELANGANA SAHITHI TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
PUBLISHED FROME : MAHABUBNAGAR
శనివారం 27-07-2024
http://www.telanganasahithi.com
4

# హార్ట్ ఎటాక్‌లు డబుల్.!



**ఆరోగ్యం:-** గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య భారతదేశంలో భారీగా పెరుగుతోంది. హృద్రోగ సమస్యల కారణంగా ఏటా సంభవిస్తున్న మరణాల్లో 20 శాతం మంది పురుషులు గుండెపోటుతో మరణిస్తుండగా 17 శాతం మంది మహిళలు అదే సమస్యతో చనిపోతున్నారు. గత 30 ఏళ్లలో గుండె సంబంధిత వ్యాధులతో సంభవిస్తున్న మరణాల సంఖ్య దాదాపు రెట్టింపు అయింది. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే భారత్‌లో పదేళ్ల ముందే గుండె సంబంధ సమస్యలు ఎదురవుతున్నాయి. యుక్తవయసులోనే గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య ఇటీవల మరింతగా పెరి గింది. గుండెపోటుకు ఎన్నో కారణాలున్నా ప్రధానంగా తక్కువ సాంద్రతగల కొవ్వుల (ఎల్‌డీఎల్) కారణంగా ఎక్కువగా హార్ట్‌ఎటాక్స్ వస్తున్నాయి.

**అసలేంటీ మందు..?**

ఇన్‌క్లిసిరాన్ అనే మందు శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. సాధారణంగా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించేందుకు స్టాటిన్స్ అనే రకం మందులు ఎన్నో ఏళ్లుగా అందుబాటులో ఉన్నా ఇన్‌క్లిసిరాన్ మాత్రం వాటికన్నా ఎన్నో రెట్లు ప్రభావవంతగా పనిచేస్తుందని అంటున్నారు. ఇంజెక్షన్ రూపంలో ఉండే ఈ మందును ఇన్సులిన్ మాదిరిగా వేసుకోవచ్చు. ఈ ఇంజెక్షన్‌ను ఆరు నెలలకోసారి తీసుకుంటే గుండెపోటు దరిచేరదని పేర్కొంటున్నారు

**ఎలా పనిచేస్తుంది?**

సాధారణంగా ఇన్‌క్లిసిరాన్ (సింథటిక్ ఎస్‌ఐ ఆర్‌ఎన్‌ఏ) కొవ్వులు తయారయ్యే ప్రక్రియకు ఆటంకం కలిగిస్తుంది. ప్లాస్మాలోని తక్కువ సాంద్రతగల కొవ్వుల (ఎల్‌డీఎల్)ను నియంత్రించే సెరిన్ ప్రోటీన్ అయిన ప్రోప్రోటీన్ కన్వర్టేజ్ సబ్టిలిసిన్ కెక్సిన్-9 (పీసీఎస్‌కే9)కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. పీసీఎస్‌కే9 మెసెంజర్ ఆర్‌ఎన్‌ఏకు ఇది అతుక్కొని పీసీఎస్‌కే9 ప్రోటీన్ తయారుకాకుండా అడ్డుకుంటుంది. దీంతో ప్లాస్మాలో ఎల్‌డీఎల్ గణనీయంగా తగ్గి రక్తంలోని ఎల్‌డీఎల్‌ను కాలేయం గ్రహించేలా చేస్తుంది. తద్వారా హృద్రోగ సమస్యలు రాకుండా కాపాడుతుంది. 200 వరకు ఉన్న స్థాయి కూడా 40 వరకు తగ్గేంత ప్రభావవంతంగా ఈ మందు పనిచేస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. ఈ మందు తీసుకున్నా కూడా జాగ్రత్తగా ఉండాలి. ఆరోగ్యకమైన జీవన విధానాన్ని పాటించాలి.

• హార్ట్ ఎటాక్‌లను దూరం చేసే సరికొత్త మందు • భారత మార్కెట్లోకి ఇంజెక్షన్ రూపంలో అందుబాటులోకి ఇన్‌క్లిసిరాన్ • ఎల్‌డీఎల్ స్థాయిలను గణనీయంగా తగ్గిస్తుందంటున్న వైద్యులు

ఆల్కహాల్, సిగరెట్ వంటి అలవాట్లకు దూరంగా ఉంటే మందు మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. అయితే ట్రై-గ్లిజరైడ్స్ ఉన్న వారిపై ఈ మందు అంతగా ప్రభావం చూపదు. - శ్రీనివాస్ కుమార్, ఇంటర్వెన్షనల్ అపోలో హాస్పిటల్స్

**ఎవరెవరు వాడొచ్చు?**

సాధారణంగా హృద్రోగ సమస్యలు అన్ని వయసుల వారికి వస్తున్నాయి. కుటుంబంలో ఎవరికైనా హృద్రోగ సమస్యలు ఉన్న చరిత్ర ఉంటే వారందరూ తక్కువ వయసులోనే ఈ మందు తీసుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నారు. చిన్న వయసులోనే అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడుతున్న వారు, 40 ఏళ్లు దాటిన వారు ఈ మందును తీసుకుంటే హార్ట్‌ఎటాక్ రాకుండా చూసుకోవచ్చని పేర్కొంటున్నారు. గుండెలో స్టెంట్ వేయించుకున్న వారు కూడా ఈ ఇంజెక్షన్ తీసుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు.

**అనుమతులు వచ్చాయా?**

ఇప్పటికే ఈ మందుకు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ కంట్రోల్ అనుమతులు మంజూరు చేయగా భారత్‌లో 6 నెలల కిందటే డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) కార్యాలయం అనుమతులు ఇచ్చింది. దీంతో తాజాగా ఈ మందును మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. నేటి నుంచి హృద్రోగ సమస్యలపై కాన్ఫరెన్స్ గుండె సమస్యలపై అవగాహన కోసం ఈ నెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్ జరగనుంది. అపోలో హాస్పిటల్స్, అమెరికాలోని కార్డియోవ్యాస్కులర్ రీసెర్చ్ ఫౌండేషన్‌తో కలిసి ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ ఈ సదస్సును నిర్వహించనుంది. గురువారం జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. గుండె విఫలమైనప్పుడు ఉపయోగపడే కొత్త పరికరాల పాత్రపై చర్చించనున్నారు. ఈ సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టులు హాజరు కానున్నారు.

# తిరుమలను మించిన శిర్డీ సాయి ఆదాయం.. ఒక్కరోజే ఏకంగా.!!



**నాసిక్, జూలై 25:-** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశుడి ఆదాయంతో శిర్డీ సాయికి పోటీ ఏర్పడింది. గురుపూర్ణిమ సందర్భంగా జులై 20న ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజులపాటు జరిగాయి. ఒక్క రోజే శిర్డీ సాయికి రూ.6 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. భక్తుల నుంచి విరాళాలు వివిధ రూపాల్లో ఈ ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సీఈఓ గోరక్షా గాడిల్కర్ మాట్లాడుతూ.. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి 2 లక్షల మంది భక్తులు తరలివచ్చారని తెలిపారు. "గురుపూర్ణిమ సందర్భంగా ఆలయానికి రూ. 2 కోట్ల 50 లక్షలకుపైగా నగదు వచ్చింది. రూ. కోటికి పైగా విరాళం సమకూరగా, డెబిట్/క్రెడిట్ కార్డులు, ఆన్‌లైన్ విరాళాలు, చెక్కులు, మనీ ఆర్డర్ల ద్వారా సుమారు రూ. 2 కోట్ల విరాళాలు అందాయి. కొంతమంది భక్తులు రూ. 10 లక్షలకు పైగా విలువైన బంగారం, వెండిని విరాళంగా ఇచ్చారు. లడ్డూ కవర్ల విక్రయం ద్వారా ఆలయ ట్రస్టు రూ.62 లక్షలకు పైగా వసూలు చేసింది. ప్రత్యేక క్యూలో వెళ్లి బాబాను త్వరగా దర్శించుకోవాలనుకునేవారికి రూ. 200 ప్రత్యేక టికెట్లు జారీ చేశాం" అని గాడిల్కర్ పేర్కొన్నారు. మూడు రోజుల పండుగ సందర్భంగా శిర్డీ పట్టణం భక్తులతో కిటకిటలాడింది. ఉత్సవాల ప్రధాన రోజైన జులై 21న జపాన్‌కు చెందిన 18 మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి బాబా ఆశీస్సులు తీసుకున్నారు. వీరంతా గత 10 సంవత్సరాలుగా ఏటా శిర్డీని దర్శించుకుంటున్నారు. ఉత్సవాల సందర్భంగా సాయి ప్రసాదాలయంలో లక్ష 90 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులను కల్పించామని ఆయన అన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రంలో 5 వేల మందికి పైగా భక్తులకు చికిత్స అందించామని, కొందరు రక్తదానం కూడా చేసినట్లు వివరించారు.

**థీమ్ పార్క్ కోసం రూ.40 కోట్లు..**

సాయిబాబా జీవితం ఆధారంగా థీమ్ పార్క్ ఏర్పాటు చేసేందుకు శిర్డీ పురపాలక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసింది. ఈ థీమ్ పార్క్‌లో సాయిబాబా జీవితం గురించి లేజర్ షో ఏర్పాటు చేస్తారు. దాదాపు 22 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు రూపొందనుంది. ఇది శిర్డీని సందర్శించే భక్తులకు అదనపు ఆకర్షణగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో భక్తుల సౌకర్యార్థం మరిన్ని ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు

# తెలుగువారు కళకు ప్రాధాన్యం ఇస్తారు

## దేవర విశేషాలను వివరించిన జాన్వీకపూర్

**బాలీవుడ్** బ్యూటీ జాన్వీకపూర్ టాలీవుడ్ అగ్ర హీరో ఎన్టీఆర్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తోంది. గత నాలుగు రోజులుగా ఆమె తాజా చిత్రం 'ఉలఝ్' సినిమా ప్రమోషన్లో బిజీగా ఉంది. ప్రతి ఇంటర్వ్యూలోనూ తారక్ గురించి ప్రస్తావిస్తోంది. అతని యాక్టింగ్, డాన్స్ గురించి పదేపదే చెబుతోంది. వీరిద్దరూ కలిసి 'దేవర' చిత్రంలో నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ ఆఖరి దశలో ఉంది. ఈ మేరకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దేవర సినిమా షూటింగ్ అనుభవాలను షేర్ చేశారు జాన్వీ కపూర్. 'తెలుగువారి పనితీరు నాకు ఎంతో ఇష్టం. వారు కళను, సినిమాను గౌరవిస్తారు వారి వ్యవహారం హుందాగా ఉంటుంది. కథపై నమ్మకంతో పని చేస్తారు. ప్రస్తుతం నేను 'దేవర'లో నటిస్తున్నా. జూనియర్ ఎన్టీఆర్ ఎనర్జిటిక్ హీరో. ఆయన రాగానే సెట్‌కే కళ వస్తుంది. అందరూ ఉత్సాహంగా ఉంటారు. ఇటీవల జరిగిన షెడ్యూల్‌లో మా ఇద్దరిపై ఓ పాటను చిత్రీకరించారు. తారక్ డాన్స్ వేగాన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఎన్టీఆర్ ఒక్క సెకనులో దేన్నైనా నేర్చుకోగలరు. అదే విషయాన్ని నేర్చుకోవడానికి నాకు 10 రోజులు పడుతుంది. ఆయనతో తర్వాత పాట షూటింగ్ కోసం ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నా. దర్శకుడు కొరటాల శివ ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. ఏ విషయమైనా సున్నితంగా చెబుతారు. ఆయనతో కలిసి పనిచేయడం ఈజీగా ఉంది' అని అన్నారు. వ్యక్తిగత విషయాల గురించి చెబుతూ 'ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని నా తల్లిదండ్రులు నేర్పారు. వాళ్లతో పాటు నా ఫ్యాన్స్ నన్ను చూసి గర్వించేలా ఉంటాను. ప్రస్తుతం సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్నాను. రిలేషన్ గురించి వెల్లడించే సమయం లేదు. ఇటీవల ఆరోగ్యపరంగా కొంచెం ఇబ్బంది పడ్డాను. ఇప్పుడే కోలుకుంటున్నా' అని జాన్వీ చెప్పారు.





# నీహారిక నిర్మాతగా కమిటీ కుర్రోళ్లు

నిహారిక కొణిదెల సమర్పణలో రూపొందిన తాజా చిత్రం 'కమిటీ కుర్రోళ్లు' ట్రైలర్ విడుదలయ్యింది. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్ వర్మ, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషించారు. యదువంశీ దర్శకుడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈసందర్భంగా శుక్రవారం చిత్ర ట్రైలర్ విడుదలైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిద్ధూ జొన్నలగడ్డ.. ఇది మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకున్నారు. ఈ ట్రైలర్ విడుదల కార్యక్రమంలో భాగమైనందుకు ఆనందిస్తున్నా. నాకు ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు థాంక్యూ. ఇది చిన్న సినిమా కాదు. కొత్త వాళ్లతో ఇలాంటి విభిన్నమైన చిత్రాన్ని తెరకెక్కిస్తున్నందుకు నిహారికను మెచ్చుకోవాలి. ఓవైపు వ్యాఖ్యాతగా, హీరోయిన్‌గా చేస్తూనే చిత్రాలను నిర్మించడం అంత సులభం కాదు. ఆమెలో ఒక వ్యాపారవేత్తను చూస్తున్నా. ఈ సినిమా మంచి వసూళ్లు అందించాలని కోరుకుంటున్నా. తెలుగు సినిమా ఇప్పుడు మంచిస్థాయిలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా మన సినిమా గురించే మాట్లాడుకుంటున్నారు. తక్కువ బ్జడెట్‌తో నిర్మితమైన చిత్రాలను సైతం ప్రోత్సహిస్తూ మనం మరింత ఉన్నత శిఖరాలకు వెళ్తున్నాం అని తెలిపారు. ఈసందర్భంగా నిహారిక తమ సినిమా కోసం కష్టపడిన ప్రతిఒక్కరికీ థాంక్యూ చెప్పారు.




# పాత కథకకు కొత్తగా రంగులు

## రాజ్‌తరుణ్ పురుషోత్తముడు మూవీ

రాజ్‌తరుణ్‌కు ప్రస్తుతం గడ్డుకాలం నడుస్తోంది. అటు కెరీర్‌పరంగా సరైన హిట్ లేదు, ఇటు వ్యక్తిగత జీవితంలోని వివాదాలు తన ఇమేజ్‌ను మసక బారుస్తున్నాయి. ఇలాంటి తరుణంలో వచ్చిన 'పురుషోత్తముడు' శుక్రవారం విడుదలయ్యింది. రచిత్ రామ్ (రాజ్‌తరుణ్) పుట్టుకతోనే కోటీశ్వరుడు. భారత్‌లోని గొప్ప వ్యాపారవేత్తల్లో ఒకరైన పీఆర్ గ్రూప్స్ అధినేత ఆదిత్య రామ్ (మురళీ శర్మ) తనయుడు. లండన్‌లో చదువులు పూర్తి చేసుకుని దేశానికి తిరిగొస్తాడు. అతను వచ్చి రాగానే పీఆర్ గ్రూప్స్ కొత్త సీఈవోగా నియమించాలని ఆదిత్య రామ్ నిర్ణయించుకుంటాడు. కానీ, దానికి రచిత్ పెద్దమ్మ వసుంధర (రమ్యకృష్ణ) అడ్డు చెబుతుంది. కంపెనీ బైలా ప్రకారం సీఈవోగా ఎంపికవ్వాల్సిన వ్యక్తి ఎవరైనా సరే 100రోజుల పాటు ఓ సామాన్యుడిలా అజ్ఞాత జీవితం గడపాల్సిందేనని పట్టుబడుతుంది. దీంతో రచిత్ తనని తాను నిరూపించుకునేందుకు ఇంటి నుంచి బయటకొచ్చేస్తాడు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని కడియం సమీపంలో ఉన్న రాయపులంక అనే పల్లెటూరికి చేరుకుంటాడు. మరి అక్కడికి వెళ్లాక రచిత్ రామ్ జీవితం ఎన్ని మలుపులు తిరిగింది?ఓ రైతు కూలీగా కొత్త జీవితాన్ని ప్రారంభించిన అతను.. ఆ తర్వాత ఆ ఊరి పూల రైతుల్ని కాపాడేందుకు ఎలాంటి సాహసాలు చేశాడు? రచిత్‌కు.. అమ్ము (హాసినీ సుధీర్)కు మధ్య చిగురించిన ప్రేమ ఎలాంటి మలుపు తిరిగింది? అన్నది మిగిలిన కథ. కోటీశ్వరుడైన కుర్రాడు కొన్ని వ్యక్తిగత లక్ష్యాల కోసం అన్నీ వదులకొని ఓ సామాన్యుడిలా కొన్నాళ్లు అజ్ఞాత జీవితం గడపాల్సి రావడం.. ఈ క్రమంలో ఓ పల్లెటూరికి వచ్చి అక్కడ సమస్యల్ని పరిష్కరించి ఆ ఊరికి దేవుడిగా మారడం.. ఈ తరహా కథాంశాలు వెండితెరకేం కొత్త కాదు. 'పురుషోత్తముడు' కూడా ఆ తాను ముక్కే. దర్శకుడు రాసిన కథలోనూ.. తెరపై ఆవిష్కరించడంలోనూ ఏమాత్రం కొత్తదనం కనిపించదు. ఇది ఓ కోణంలో 'శ్రీమంతుడు'కు పాత వెర్షన్‌లా.. ఇంకో కోణంలో 'బిచ్చగాడు'కు అప్‌డేట్ వెర్షన్‌లా కనిపిస్తుంది. పాత్ర పరిచయం, కథా నేపథ్యంతో సినిమాను త్వరగానే మొదలు పెట్టిన దర్శకుడు రాయపులంక చేరాక, మరీ నెమ్మదిగా సాగుతుంది. హీరో-హీరోయిన్ పరిచయం, ప్రేమ మాత్రం ప్రేక్షకులకు కాస్త కాలక్షేపాన్ని ఇస్తుంది. ఎప్పుడైతే హీరో రాయపులంక పూల రైతులకు జరుగుతున్న అన్యాయాలపై తిరగబడేందుకు సిద్ధపడతాడో.. అక్కడి నుంచి కథ కాస్త వేగం పుంజుకుంటుంది.అయితే ప్రథమార్థం వరకు పడుతూ లేస్తూ సాగిన కథనం.. ద్వితీయార్ధానికి వచ్చే సరికి పూర్తిగా గాడి తప్పింది. కథలో ఎక్కడా బలమైన సంఘర్షణ కనిపించదు. ప్రతినాయకుడి పాత్రని కూడా శక్తిమంతంగా తీర్చిదిద్దుకోలేకపోయారు. ఆ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు పెద్దగా రక్తి కట్టలేదు. క్లైమాక్స్ ఊహలకు తగ్గట్లుగా ఉన్నా.. పతాక సన్నివేశాల్లో ప్రకాశ్‌రాజ్ పాత్ర ఎంట్రీ.. ఆయన చెప్పే డైలాగ్‌లు ఆకట్టుకుంటాయి.







Edited. Printed. Published & Owned By M.Manohargoud. Printed at Mythri Printing Press Beside DCC Bank Telangana Chowrastha. Mahabubnagar. Telangana, and Published at H.No.LIG14 indastriyal Quarters. Mettugada. Mahabubnagar. Telangana. Editor, M. MANOHARGOUD.RNI No. TELTEL/2015/64477.Cell; 9912461515,8247569876. Email; telanganasahithi@gmail.com